ప్రజాశక్తి
శుక్రవారం 21 ఫిబ్రవరి 2025
5
అల్లూరి సీతారామరాజు



ఎంపిటిసిలకు గౌరవ వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి -హుకుంపేట: 20 నెలల ఎంపీటీసీల గౌరవ వేతనం బకాయి విడుదల చేయాలని ఎంపీటీసీలు మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ రాజుబాబు మాట్లాడుతూ, ఎంపీపీలు తిరగడానికి వెహికిల్ అలవెన్స్ ఇవ్వలేదన్నారు. ఎంపీటీసీలకు గౌరవేతనం మంజూరు కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు మాట్లాడుతూ, ఎంపీపీ, ఎంపీటీసీలకు సర్పంచ్లకు వెంటనే వేతనాలు విడుదల చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ లు శెట్టి మహేష్, భీమలింగేశ్వర రావు, సంబాయి కొండమ్మ, కోరాబు నాగ లక్ష్మీ, కిల్లో మీనా, నైని రజని, సాంబే బాలకృష్ణ, కొర్ర నాగ రాజు, కోరాబు వెంకట్ పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ఎంపిటిసిలు

తాగునీటి కష్టాలు..

- కిలోమీటర్ల దూరంలో ఉన్న ఊటగెడ్డ నీరే దిక్కు
- కలుషిత నీటితో ప్రబలుతున్న వ్యాధులు
- మధ్యలోనే నిలిచిన రక్షిత మంచినీటి పథకం పనులు
- ఇదీ దుమ్మగుడ గ్రామ గిరిజనుల దుస్థితి



కాలినడకన గెడ్డ నుంచి నీటిని తెచ్చుకుంటున్న గిరిజన మహిళలు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: మండలంలోని పద్మాపురం పంచాయతీ దుమ్మగుడ గ్రామానికి చెందిన మహిళలు మంచి నీళ్ల కోసం అవస్థలు పడుతున్నారు. గత్యంతరం లేక గ్రామానికి కిలో మీటర్ దూరంలో ఉన్న ఊటగెడ్డ నుంచి నీళ్లు తెచ్చుకుంటున్న పరిస్థితి నెలకొంది. ఊటగెడ్డ నీళ్లు సురక్షితం కాకపోవడంతో స్థానిక ప్రజలు తరచూ వ్యాధుల బారిన పడుతున్నారు.

దుమ్మగుడ గ్రామంలో సుమారు 50 గిరిజన కుటుంబాలు నివాసముంటున్నాయి. గత 2022-2023 లో ఇంటింటికీ తాగు నీరు అందించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జల జీవన్ మిషన్ పథకం కింద 17 లక్షల 18 వేల నిధులు మంజూరు చేశారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గుత్తేదారుడు వాటర్ ట్యాంక్ నిర్మించి, గ్రామంలో ఒక్క మూడు ట్యాపులు బిగించి, వాటర్ కనెక్షన్ ఇవ్వకుండా పనులు మధ్యలోనే నిలిపివేశారు. దీంతో తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నిరుపయోగంగా ఉన్న మోటార్

ప్రస్తుతం గ్రామానికి చెందిన మహిళలు గ్రామ శివారు పొలం వాగు, గట్టు దాటి ఊటగెడ్డకు వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నారు. ఈ ఊటగెడ్డ గ్రామానికి కిలోమీటర్ల దూరంలో ఉంది. ప్రస్తుతం ఎండాకాలం వస్తుండడంతో ఊటగడ్డ నీరు ఇంకిపోయి నీళ్లు దొరికే పరిస్థితి కుడా ఉండదని, దీంతో నీళ్ల కష్టాలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలుషితమైన నీరు వినియోగించడంతో తరచూ అస్వస్థతకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రక్షిత మంచినీటి పథకాన్ని వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న రక్షిత తాగునీటి పథకం

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు

దుమ్మగూడ గ్రామంలో తాగునీరు కష్టాలపై అధికారులను ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. గ్రామంలో రోజురోజుకు తాగునీరు సమస్య తీవ్రంగా పెరుగుతుంది. దీంతో తప్పని పరిస్థితుల్లో కలుషితమైన నీటిని తాగుతున్నారు. 2022- 2023 సంవత్సరంలో జల జీవన్ మిషన్ పథకం కింద నిధులు మంజూరయితే నేటికీ పనులు పూర్తి చేయలేదు. గుత్తేదారుడు పనులు మధ్యలోనే నిలిపివేశారు. తాగునీరు సమస్య పరిష్కరించాలి.



జన్ని భగత్ రామ్,
ఉప సర్పంచ్



పట్టభద్రుల ఓటర్లను కలిసి ఓటు అభ్యర్థిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పిడిఎఫ్ అభ్యర్థి డివి.రాఘవులును గెలిపించాలి

ప్రజాశక్తి-విఆర్.పురం

ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డివి.రాఘవులుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ప్రజా సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మండలంలోని విఆర్.పురం, వడ్డిగూడెం గ్రామాల్లో గురువారం ప్రజా సంఘాల నాయకులు జోరుగా ప్రచారం చేశారు. పాఠశాలలు, కాలేజీలు, షాపులు, ఇళ్ల వద్ద పట్టభద్రుల ఓటర్లను కలిసి డివి రాఘవులు గెలిపించాలని కరపత్ర ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ పాఠశాలల్లో ఏఎన్ఎంలను రెగ్యులర్ ప్రతిపాదికన నియమించాలని, ఆశ్రమ పాఠశాలలను ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. నిరుద్యోగుల కష్టాలు తెలిసిన వారు పిడిఎఫ్ అభ్యర్థులు మాత్రమేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు, మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, మండల నాయకులు పంకు సత్తిబాబు, కమ్మచిచ్చు సత్యనారాయణ, సిహెచ్ సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి పెట్టాలి

ఎమ్మెల్యే మత్స్యలింగం

ప్రజాశక్తి-హుకుంపేట: ప్రజల సమస్యలపై అధికారులు దృష్టి పెట్టాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీపీ కూడా రాజు బాబు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ, ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలని, సమయపాలన పాటించాలన్నారు. విధులు సక్రమంగా నిర్వహించాలని, సేవా భావంతో పని చేయాలని ఆయన అధికారులకు ఆదేశించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని, ప్రోటోకాల్ తప్పక పాటించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందించే పథకాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎంతటివారికైనా చర్యలు తప్పవని అధికారులకు హెచ్చరించారు. ప్రజలకు సేవలు అందే విధంగా అధికారులు పని చేయాలన్నారు. అధికారులు ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ, తహసీల్దార్, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్స్యలింగం



రంగురాళ్లు తవ్వకాలు చేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న యువకులు

రంగురాళ్ల తవ్వకాలను అరికట్టాలి

ప్రజాశక్తి-అల్లూరి జిల్లా : అడ్డతీగల మండలంలోని మల్లవరం మామిళ్ళ గ్రామంలో పగలు రాత్రి అనే తేడా లేకుండా రంగురాళ్ల తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయని, వాటిని అరికట్టాలని గిరిజన యువత డిమాండ్ చేసింది. మల్లవరం మామిళ్ల గ్రామంలో జీడి మామిడి తోటలో జరుగుతున్న తవ్వకాలను గురువారం గిరిజన యువకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతమంది దళారులు భూమి యజమానికి డబ్బులు ఆశ చూపి, భూమి కాపలా పేరుతో రంగురాళ్ల తవ్వకాలు సాగిస్తున్నారని తెలిపారు. వీటిని అరికట్టాల్సిన అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. గతంలో రంగురాళ్ళ క్వారీలు కూలిపోయి అనేకమంది గిరిజనులు మృత్యువాత పడ్డారని, ఇప్పుడు మల్లవరం మామిళ్ల గ్రామంలో తవ్వకాలు సాగుతున్న తిరుపతమ్మ క్వారీలో అదే పరిస్థితి నెలకొని ఉందని పేర్కొన్నారు. రంగురాళ్ల తవ్వకాలను పరిశీలించడానికి తాము తిరుపతమ్మ క్వారీని సందర్శించే సమయంలో తమను చూసి అక్కడ నుండి పరారైనట్లు చెప్పారు. గిరిజన ప్రజలు, యువతతో చెలగాటమాడే ఈ క్వారీల్లో తక్షణమే తవ్వకాలు అరికట్టాలని డిమాండ్ చేశారు. యువత ఈజీ మనీకి అలవాటు పడి తమ ప్రాణాలను ఫణంగా పెట్టి ఈ తవ్వకాలకు పాల్పడుతున్నారని, దీని వల్ల తమ కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు



విద్యార్థులతో సర్పంచ్ సునీత


పాఠశాల నిర్మాణ పనులు చేపట్టాలి

- సిపిఎం సర్పంచ్ సునీత

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: గసభ పంచాయతీ జంగిడి వలస గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనం పనులు వెంటనే ప్రారంభించాలని ఆ పంచాయతీ సిపిఎం సర్పంచ్ పి.సునీత డిమాండ్ చేశారు. పనులు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఆ పాఠశాల విద్యార్థులతో సిపిఎం నాయకులు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గత ప్రభుత్వ హాయంలో నాడు నేడులో భాగంగా రూ 34 లక్షల నిధులు మంజూరు అయ్యిందని చెప్పారు. జంగిడి వలస పాఠశాల నిర్మాణ పనులు జాంగూడ స్కూల్ కాంప్లెక్స్ తెలుగు టీచర్ కన్యాకుమారికు అప్ప జెప్పారన్నారు. పాఠశాల కమిటీ బ్యాంకు ఖాతాలో డబ్బులు జమై ఉన్న కూడా పనులు జరగడం లేదని మండిపడ్డారు. పాఠశాల కమిటీ తీర్మానాలు చేయకుండా ఇష్టారాజ్యంగా డబ్బులు డ్రా చేసుకుని పనులు పూర్తి చేయలేదని విమర్శించారు. జంగిడి వలస పాఠశాలకు సంబంధించిన ఖర్చు వివరములపై వెంటనే జిల్లా కలెక్టర్, జిల్లా విద్యా శాఖ అధికారులు విచారణ జరిపించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాల భవనం లేక పోవడంతో ఆరుబయట విద్యా బోధన జరుగుతుందనీ ఆవేదన వ్యక్తంచేశారు. ఈ పాఠశాలలో జంగిడి వలస, అడ్రగూడ గ్రామాల విధ్యార్దులు చదువు కుంటున్నారనీ చెప్పారు. వెంటనే నిర్మాణ పనులు మొదలు పెట్టాలని డిమాండ్ చేశారు. లేకపోతే మండల విద్యా శాఖ కార్యాలయన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఆ పంచాయితీ వార్డుమెంబర్ పి సత్యనారాయణ, పాఠశాల కమిటీ సభ్యులు ప్రసాద్, గాసీ పాల్గొన్నారు.

భూ దాతలపై నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండల కేంద్రంలో ఏకలవ్య పాఠశాల భవనాల నిర్మాణముకు సాగు భూములు ఇచ్చిన భూ దాతలకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రతినిధి పి.చిన్నస్వామి చెప్పారు. ఉద్యోగాలు కల్పించాలని నిరసిస్తూ భూ దాతలు చేపట్టిన ఆందోళన గురువారం 28వ రోజు చేరుకుంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు సందర్శించి సంఘీభావం ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సాగు భూములు ఇచ్చిన భూ దాతలకు ఉద్యోగాలు కల్పించకుండా వేరేవారికి ఉద్యోగాల్లో నియమించడం సరికాదన్నారు. 28 రోజులు ఆందోళన చేస్తున్నా పరిష్కరించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని, తక్షణమే వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు పరశురాం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

41.15 కాంటూరులో చేర్చి ఆర్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి

జిల్లా కలెక్టర్‌కు నూతిగూడెం గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని పెద్దమట్టపల్లి పంచాయితీ పరిధి నూతిగూడెం గ్రామాన్ని పోలవరం ప్రాజెక్టు ముంపు 41.15 కాంటూరు పరిధిలో చేర్చి, తమకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని ఆ గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం చింతూరు ఐటీడీఏ కార్యాలయానికి వచ్చిన అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌కు నూతిగూడెం గ్రామస్తులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామంలో మొత్తం 86 గిరిజన కుటుంబాలు నివాసిస్తున్నాయని తెలిపారు. ప్రతిఏటా జూన్ నుంచి సెప్టెంబర్ మూడు నెలల్లో వచ్చే గోదావరి వరదలకు తమ గ్రామం మొత్తం పూర్తిగా ముంపునకు గురై పిల్లలు, వృద్ధులతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని, రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వరదలు వచ్చినప్పుడు గుట్ట మీదే దోమలు, పాములతో భయ భయంగా మూడు నెలలు గడపాల్సి వస్తుందని పేర్కొన్నారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో 2008లో తమ భూములకు ఎకరాకు రూ.1.15 లక్షలు ఇచ్చారని తెలిపారు. 2022లో సంభవించిన వరద ముంపు తరువాత ఆర్ అండ్ ఆర్ ఇళ్ల సర్వే చేసి స్ట్రక్చర్ వ్యాల్యూ వేసి తమకు నోటీసు కూడా ఇచ్చారని గుర్తు చేశారు. కానీ రెండు రోజుల క్రితం ప్రభుత్వం ప్రకటించిన మొదటి జాబితాలో తమ గ్రామం పేరు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల మళ్లీ రీ సర్వే చేసి తమ గ్రామాన్ని 41.15 కాంటూరులో చేర్చి న్యాయం చేయాలని కోరారు. దీనికి స్పందించిన కలెక్టర్ ఈ సమస్యలను అధికారులు దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేకూర్చేలా చేస్తానని హామీ ఇచ్చారు.



కలెక్టర్‌కు తమ సమస్యలను తెలియజేస్తున్న నూతిగూడెం గ్రామస్తులు

గాము మల్లుదొర వారసులను కూడా ఆదుకోవాలి

ప్రజాశక్తి-కొయ్యూరు

ప్రముఖ మన్యం స్వాతంత్ర్య సమరయోధులు, అల్లూరి సీతారామరాజు అనుచరుడు గాము మల్లుదొర వారసులను ప్రభుత్వం విస్మరించడం సరికాదని, తమను కూడా ఆదుకోవాలని గాము మల్లుదొర కుటుంబీకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గాము గంటందొర కుటుంబాన్ని మాత్రమే ప్రభుత్వం ఆదుకొని గాము మల్లుదొర కుటుంబాన్ని మర్చిపోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేశారు. గాము గంటం దొరతో పాటు గాము మల్లుదొర కూడా మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అనుచరుడిగా స్వాతంత్ర్య సమరంలో కీలకపాత్ర పోషించిన విషయం అందరికీ తెలిసిందేనని పేర్కొన్నారు. అలాంటిది మల్లుదొర వారసులను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి గాము మల్లుదొర వారసులమైన తమను కూడా ఆదుకోవాలని కోరారు. ఈ విలేకర్ల సమావేశంలో మల్లుదొర కుమార్తెలు కొప్పుల చంద్రావతి, పుత్తూరు లక్ష్మి, వారి కుమారులు, కుమార్తెలు కొప్పుల రాజబాబు, కొప్పుల బాలమ్మ, కొప్పుల లక్ష్మి, పుత్తూరు నాగమణి, పుత్తూరు కుమారి, పుత్తూరు విజయ, పుత్తూరు కల్పన పాల్గొన్నారు.



అల్లూరి, మల్లుదొర విగ్రహాల వద్ద మల్లుదొర వారసులు

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

ప్రజాశక్తి-గంగవరం : వాహనదారులు రహదారి భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని ఎస్సై బి వెంకటేష్ అన్నారు. స్థానిక వై జంక్షన్‌లో రహదారి భద్రత నియమాలపై వాహనదారులకు పాదచారులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించవద్దని, ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. వాహనాలకు సంబంధించిన రికార్డులను వాహనాలతో పాటు ఉంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా వాహనాల తనిఖీ చేపట్టి రికార్డులు సక్రమంగా లేని వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గంగవరం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకటేష్



లోదొడ్డి బేస్ క్యాంపు వద్ద అటవీ సిబ్బందితో మాట్లాడుతున్న డిఎఫ్ఓ రవీంద్ర

అడవుల పరిరక్షణకు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : అడవుల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టినట్లు డిఎఫ్ఓ రవీంద్ర దాన అన్నారు. మండలంలోని లోదొడ్డి బేస్ క్యాంపును గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఉర్లాకులపాడు నర్సరీలో మొక్కలు పెంచేందుకు చేపట్టిన పనులను పరిశీలించారు. అడవుల పరిరక్షణకు అటవీశాఖ సిబ్బంది అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఏజెన్సీ నుండి టేకు, ఇతర మారుజాతి కలప స్మగ్లర్లు బారిన పడకుండా నిరంతరం వాటి రక్షణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రానున్న వేసవి నేపథ్యంలో అడవుల్లో మంటలు చెలరేకుండా సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రేంజ్ అధికారి ఉషారాణి, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పీసా చట్టంపై అవగాహన

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండల కేంద్రంలో పీసా చట్టంపై పీసా కమిటీ సభ్యులకు గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర అబ్జర్వర్ కె.నాగరాజు ఎస్‌హెచ్‌సి గ్రూపులకు పీసా చట్టాలపై అవగాహన కల్పించారు. సమస్య పరిష్కారాల కొరకు గ్రామపంచాయతీ లాగా పీసా గ్రామసభలు ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తు చేశారు. నాలుగైదు హేబిటేషన్లో సమస్యలు వస్తే పీసా గ్రామసభ ఏర్పాటు చేసి అక్కడికి అక్కడే సమస్యల పరిష్కారం మార్గం చూపుతారని పేర్కొన్నారు. అడవిపై ఆధారపడి జీవిస్తున్న గిరిజనులు అటవీ ఉత్పత్తులను సేకరించి అమ్ముకోవచ్చని, దీనికి ప్రభుత్వం కొన్ని అవకాశాలు కల్పించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, యుఓపిఆర్‌డి పాపారావు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



పీసా చట్టంపై శిక్షణలో మాట్లాడుతున్న అబ్జర్వర్ నాగరాజు



క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న ప్రసాద్

క్షయపై అవగాహన

ప్రజాశక్తి - చింతపల్లి : క్షయ వ్యాధి ప్రాణాంతకం కాదని, సకాలంలో మందులు వాడితే నయం అవుతుందని స్థానిక క్షయ వ్యాధి సూపర్వైజర్ ప్రసాద్ అన్నారు. యాంటీ టి బి వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా లంబసింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బాలుర ఆశ్రమ వసతి గృహ పాఠశాలలో క్షయ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గ్రామాలలో క్షయ వ్యాధి పట్ల ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు ఉన్నట్లయితే దగ్గరలో ఉన్న ఆసుపత్రులలో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి ఉన్నట్లు నిర్ధారణయితే భయపడవలసిన అవసరం లేదని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులు అందుబాటులో ఉన్నాయని, పూర్తి స్థాయిలో వాడితే వ్యాధి నయమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ వసతి గృహ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిసిహెచ్ఎస్‌గా లక్ష్మి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు: డిసిహెచ్ఎస్‌గా డాక్టర్ కె లక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ ఆదేశాల మేరకు బాధ్యతలు స్వీకరించినట్లు చెప్పారు. అప్పగించిన విధులు ఎంతో బాధ్యతగా, నిబద్ధతతో నిర్వర్తిస్తానని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఇంతవరకు ఆమె రంపచోడ వరం ఏరియా హాస్పిటల్‌లో గైనకాలజిస్ట్‌గా విధులు నిర్వర్తించారు.

జిమ్‌సర్ 'సిపిఆర్ శిక్షణ'

ప్రజాశక్తి -మధురవాడ : గుండె కొట్టుకోవడం స్తంభించినప్పుడు అత్యవసర పరిస్థితులలో హృదయ శ్వాసకోశ పునరుజ్జీవనం (సిపిఆర్) ద్వారా ఎలా సహాయ పడవచ్చో తెలియ జేయడానికి, ప్రతి ఒక్కరు సకాలంలో స్పందించి ప్రాణదాతలుగా నిలవడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్‌సర్) ఎమర్జెన్సీ మెడిసిన్ ఎస్ఐఎమ్ఇ విభాగం రికార్డు స్థాయిలో 900 మందికి శిక్షణ ఇచ్చిందని విభాగాధిపతి డాక్టర్ దివ్యజ్యోత్స్న వెల్లడించారు. అంతర్జాతీయ వైద్య ప్రమాణాలకు అనుగుణంగా వైద్యులతో పాటు అంబులెన్సు డ్రైవర్లు, నర్సింగ్ సిబ్బంది, ఆక్సిజన్ ప్లాంట్ సిబ్బంది, ఫార్మసీ, ఆతిథ్యవిభాగం, సెక్యూరిటీ, హౌస్ కీపింగ్ సిబ్బంది, విద్యార్థులకు దశల వారీగా ఈ శిక్షణ అందించినట్లు ఆమె తెలిపారు. మరో 900 మందికి రానున్న రోజులలో ఈ శిక్షణ అందిస్తామన్నారు. గీతం ఆసుపత్రిలోని అత్యవసర వైద్య విభాగానికి అనుబంధంగా గల సిమ్యులేషన్ ఆధారిత వైద్య విద్యా విభాగం (ఎస్ఐఎమ్ఇ) నిపుణులు డాక్టర్ స్వప్నత, దివ్యవాణిల పర్యవేక్షణలో ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కాగా సిపిఆర్‌పై పెద్ద సంఖ్యలో శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడాన్ని గురువారం జరిగిన కార్యక్రమంలో జిమ్‌సర్ ప్రొ వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి అభినందించారు. శిక్షణ పొందిన ప్రతి ఒక్కరూ సామాజిక కార్యకర్తల మాదిరిగా అత్యవసర పరిస్థితులలో ఉన్నవారికి సిపిఆర్ ద్వారా ప్రాణదానం చేయాలని, మరి కొంత మందికి అవగాహన కల్పించాలని సూచించారు.

చోరీ కేసులో ఏడాది జైలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఓ ఇంట్లో 2023లో జరిగిన దొంగతనం కేసులో ముద్దాయికి స్థానిక కోర్టు ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు స్థానిక నేర విభాగం ఎస్ఐ ఎస్.సూర్యప్రకాశరావు గురువారం తెలిపారు. ఎస్ఐ సూర్యప్రకాశ రావు కథనం ప్రకారం... తగరపువలసలోని ఓ అపార్ట్‌మెంట్‌లో డి.నరసింహారావు ఇంట్లోకి రాత్రి వేళ కిటికీ మార్గం గుండా ప్రవేశించి బీరువాలో ఉన్న సుమారు లక్ష రూపాయలు దొంగిలించిన కేసులో విజయనగరం జిల్లా, డెంకాడ మండలం, గొండ్యాపాలెం గ్రామానికి చెందిన ఎర్నింటి కృష్ణబాబు (22)ను పోలీసులు అరెస్టుచేశారు.

సేంద్రియ సాగుకు ప్రతిపాదనలు

కలెక్టర్ దినేష్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: సేంద్రీయ వ్యవసాయాభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ పేర్కొన్నారు. ఖరీఫ్ కార్యచరణ ప్రణాళికలు 2025-26 ఆర్థిక వ్యవసాయానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. రానున్న మూడు, నాలుగేళ్ల లో సేంద్రీయ వ్యవసాయంగా జిల్లాగా అభివృద్ధి చేయాలన్నారు. గురువారం కలెక్టరేట్ నుండి ఐటిడిఏ పి.ఓలు, వ్యవసాయాధికారులు, ఉద్యాన వన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చత్తీష్‌గడ్ రాష్ట్రం దంతెవాడ జిల్లాలో సేంద్రీయ వ్యవసాయాన్ని అమలు చేస్తున్నారని, దానిని ఆదర్శంగా తీసుకుని జిల్లాలో అమలు చేయాలని స్పష్టం చేసారు. జిల్లాలో 1 లక్ష 25 వేల ఎకరాల్లో సేంద్రీయ వ్యవసాయం చేస్తున్నారని పేర్కొన్నారు. గిరిజన రైతులు సాగు చేస్తున్న పట్టా భూములు, అటవీ భూముల్లో ఎరువులు వినియోగిస్తున్న రైతులు ఎంత శాతం వినియోగిస్తున్నారో సమగ్రమైన సర్వే చేయాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి నేతృత్వంలో రెవెన్యూ గ్రామాల పరిధిలో గ్రామ సర్వేయరు, వి.ఆర్.ఓ, గ్రామ వ్యవసాయ సహాయకులు, వెలుగు సిబ్బంది బృందంగా ఏర్పడి సర్వే చేయాలని సూచించారు.

ఆర్గానిక్ జిల్లాగా అభివృద్ధి చేయడానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక కాఫీ హౌస్లో వ్యవసాయ, ఉద్యానవన, జెడ్‌బిఎన్ఎఫ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పూర్తి స్థాయి ఆర్గానిక్ వ్యవసాయ జిల్లాగా మార్చేందుకు అనుగుణంగా 2025-26 ఖరీఫ్ కార్యచరణ ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. ప్రతీ రైతు కు ఆర్గానిక్ సర్టిఫికేట్ వచ్చే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.ఈ సమావేశంలో పర్చువల్ గా ఐటిడిఏ పిఓలు ఎం.జె.అభిషేక్ గౌడ, కట్టా సింహాచలం, దంతెవాడ కలెక్టరేట్ నుండి ఆకాష్ బద్వే, ప్రత్యక్షంగా జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి. ఎస్. నంద్, జిల్లా ఉద్యాన వన అధికారి ఎ.రమేష్ కుమార్ రావు, డిపిఎం భాస్కరరావు, వ్యవసాయాధికారులు, ఉద్యాన వన అధికారులు పాల్గొన్నారు.

రహదారి అస్తవ్యస్తం



శిథిలమైన రహదారి

ప్రజాశక్తి -చింతపల్లి: మండలంలోని కడశిల్ప, చిన్నకొత్తపాలెం గ్రామాలలో రోడ్డు గుంతల మయమైంది. నిత్యం అటు చింతపల్లి, నర్సీపట్నం, ఇటు కొత్తపల్లి వాటర్ ఫాల్స్, పాడేరు, అరకు, వెళ్లే ప్రయాణికులు ఈ రోడ్డుపై అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. ఈ గుంతల మయమైన రోడ్డులో వెళ్లాలంటే ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం మరమ్మతుకు నోచుకోవడం లేదని గ్రామస్తులు, వాహన దారులు వాపోతున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి విద్యార్థులు మండల కేంద్ర మైన చింతపల్లి చేరుకోవాలంటే ఈ రోడ్డు గుండా రావాల్సి ఉంటుంది. ఈ రహదారి మార్గం గుండా అటు అన్నవరం నుండి గొడ్డు గుర్రాల మెట్ట, వట్టిబుసుల, బెన్నవరం, పోతురాజు గుమ్మలు, కడశిల్ప, చిన్న కొత్తపాలెం, బిల్లబడ్డు, మామిడిపల్లి, భీమసింగి, ఉమారాసగొంది, గ్రామాల మీదుగా దగ్గర మార్గంగా లోతుగడ్డ జంక్షన్ మెయిన్ రోడ్‌కు చేరుకోవాలంటే ఈ 12 గ్రామాల ప్రజలు ప్రతి రోజు ఇబ్బందులు పడుతున్నారు.కూటమి ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి కృషి చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్ర బడ్జెట్

ప్రజాశక్తి -ములగాడ: 2025 -26 కేంద్ర బడ్జెట్ కార్పొరేట్లకు అనుకూలంగా ఉందని, సామాన్య ప్రజల అవసరాలను నిర్లక్ష్యం చేసిందని ప్రముఖ ఆర్థికవేత్త ఆచార్య కె.పద్మ అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యాన కేంద్ర బడ్జెట్‌పై సదస్సు నిర్వహించారు. సదస్సు ముఖ్య అతిథిగా పద్మ హాజరై మాట్లాడుతూ, నిరుద్యోగం, తక్కువ వేతనాలు, ఆర్థిక సంక్షోభం వంటి సమస్యలకు ఈ బడ్జెట్ పరిష్కారాన్ని సూచించలేదన్నారు. ఆరోగ్యం, విద్య, గ్రామీణ అభివృద్ధి వంటి ముఖ్యమైన రంగాలకు తగిన నిధులు కేటాయించలేదని తెలిపారు. ఈ బడ్జెట్ అసమానతలను పెంచేదిగా ఉందన్నారు. ధనవంతులకు సంపద పన్నును విధించాలని డిమాండ్ చేశారు. గౌరవ అతిథి బొట్ట నర్సింగరావు ఫౌండేషన్ సభ్యులు ఎం.సుజాత మాట్లాడుతూ, బడ్జెట్ పేదల జీవితాల్లో వెలుగులు నింపేదిగా ఉండాలన్నారు. ఆత్మీయ అతిథి, బొట్ట నర్సింగరావు ఫౌండేషన్ సభ్యులు బుజ్జి మాట్లాడుతూ, విద్యార్థినులు సామాజిక అంశాలపై, దేశంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సదస్సులో జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయాదేవి, అర్థశాస్త్ర అధ్యాపకులు బిపి.రాజు, విద్యార్థినులు, జాతీయ సేవా పథక కార్యకర్తలు పాల్గొన్నారు. కేంద్ర బడ్జెట్‌పై విద్యార్థినులకు క్విజ్ పోటీలు నిర్వహించి, బహుమతులను అందజేశారు.

నేరాలు ఘోరాలు

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం బోనిలో ఆంజనేయస్వామి గుడి వద్ద విద్యుత్ స్తంభాన్ని గురువారం లారీ ఢీకొనడంతో అది విరిగి నేలకొరిగింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. 11 కెవి విద్యుత్ వైర్లు నేలకొరగడంతో సిర్లపాలెం, పేకేరు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్తు స్తంభం విరిగిందన్న సమాచారం అందుకున్న లైన్‌మ్యాన్ మహేష్ తదితరులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. లారీ యాజమాన్యంతో మాట్లాడి, విద్యుత్ వైర్లను సరిచేశారు.

గంటల వ్యవధిలో బాలిక ఆచూకీ

ప్రజాశక్తి -గోపాలపట్నం : గోపాలపట్నం పోలీసు స్టేషన్ పరిధిలో తప్పిపోయిన బాలిక ఆచూకీని గంటల వ్యవధిలో కనిపెట్టి కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు. ఒక బాలిక తప్పిపోయినట్లు గోపాలపట్నం పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు వచ్చిన వెంటనే పోలీసులు స్పందించారు. టెక్‌సెల్, సీసీటీవీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో గంటల వ్యవధిలో సదరు బాలిక ఆచూకీని కనిపెట్టారు. బాలికను కుటుంబ సభ్యులకు అప్పగించారు. గోపాలపట్నం పోలీసులను కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అభినందించారు.

పెన్షన్ సవరణ చేపట్టాలి

ప్రజాశక్తి - ఆరిలోవ : బిఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగుల మూడో వేతన సవరణ తక్షణమే ప్రకటించాలని, పెన్షన్ రివిజన్‌లతో పాటు 4జి, 5జి సేవలను అందుబాటులోకి తీసుకు రావాలని బిఎస్ఎన్ఎల్ ఎఐబిడిపిఎ అసిస్టెంట్ సర్కిల్ కార్యదర్శి జిఎస్ఎన్.రాజు డిమాండ్ చేశారు. విశాలాక్షినగర్‌లోని విజయ జ్యోతి ఆర్కేడ్ అపార్ట్‌మెంట్ ప్రాంగణంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు 2017 జనవరి నుంచి 15 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ జరగాల్సి ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు పదేళ్లకోసారి వేతన సవరణ జరిగాల్సి ఉన్నా 17 ఏళ్లుగా జరగలేదని ఆవేదన వ్యక్తంచేశారు. పెన్షనర్లకు పెన్షన్ రివిజన్ అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. గత ఎనిమిదేళ్ల నుంచి పెన్షన్ రివిజన్ జరగక పోవడానికి కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. కోర్టులో కేసులు సాకుగా చూపించి, పెన్షన్ సవరణను నిరాకరిస్తుందని తెలిపారు. పెన్షన్ సవరణ జరగక పోవడంతో లక్షలాది మంది పెన్షనర్ల కుటుంబాలు బాధపడుతున్నారని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అనువైన పరిస్థితులున్నా 4జి, 5జి సేవలు బిఎస్ఎన్ఎల్ సంస్థ వినియోగదారులకు విస్తరించకుండా సంస్థను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. ఎఐబిడిపిఎ జిల్లా అధ్యక్షులు గోవిందరావు మాట్లాడుతూ, బిఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగులకు సిజిహెచ్ఎస్ నుంచి క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్‌కు అనుమతించాలని పాత పెన్షన్ స్కీమ్‌ను పున: ప్రారంభించాలని, పెన్షనర్ల మరణానంతరం 10 ఏళ్లు పూర్తి కుటుంబ పెన్షన్ ఉండాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు జిఎఫ్.ఫ్రాన్సిస్, పివి.రమణ, ఎఎన్.హనుమంతురావు, కె.రామాంజనేయులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ టాయిలెట్ పనుల పరిశీలన

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని టి.నగరపాలెం, మజ్జిపేట గ్రామాల్లో మధ్యలో నిలిచిన కమ్యూనిటీ టాయిలెట్ల పునర్నిర్మాణ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ డిఇఇ ఈశ్వరీభాయ్, ఎఇ ఎస్.దుర్గాభవానీతో కలిసి ఎస్ఇ ఎవివి.చౌదరి గురువారం పరిశీలించారు. వీలైనంత త్వరగా కమ్యూనిటీ టాయిలెట్ల పునర్నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రస్తుత వేసవి నేపథ్యంలో మండలంలో తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని డిఇఇ, ఎఇలను ఆదేశించారు. పలు గ్రామాల్లో తాగు నీటి నిల్వ నిమిత్తం సోప్ పిట్లు ఏర్పాటుకు అనువైన స్థలాలను పరిశీలించారు. 16 పంచాయితీల్లో 59 గ్రామాల్లో సుమారు 60 సోప్ పిట్లు ఏర్పాటు చేయనున్నట్లు ఎఇ దుర్గా భవానీ తెలిపారు. మండలంలో తాగునీటి బోర్లు, రక్షిత మంచినీటి పథకాల నిర్వహణపై ఎస్ఇ చౌదరి ఆరా తీశారు. మరమ్మతుకు గురైన తాగు నీటి బోర్ల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 1 నుంచి మార్చి 20వ తేదీ వరకు 45 రోజుల పాటు యుద్ధ ప్రాతిపదికన క్రాష్ ప్రోగ్రాంలో భాగంగా మరమ్మతులు చేపడుతున్నట్లు ఎస్ఇ తెలిపారు. మండలంలో 609 తాగు నీటి బోర్లు, అన్నవరం, మూలకుద్దు, దాకమర్రిలో సిపిడబ్ల్యు పథకాలు, 15 మినీ పిడబ్ల్యు, 47 పిడబ్ల్యు పథకాలు ఉన్నట్లు డిఇఇ, ఎఇలు వివరించారు.



విజ్ఞాన విహార యాత్రకు తరలివెళ్లిన విద్యార్థులు

విద్యార్థుల విజ్ఞాన విహారయాత్ర

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : విద్యార్థులకు నూతనంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విజ్ఞాన విహార యాత్రలో భాగంగా స్థానిక అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులను అనకాపల్లి జిల్లా తాళ్లపాలెం రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీ సందర్శనకు తీసుకెళ్లినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాలకృష్ణ తెలిపారు. బ్యూరో ఆఫ్ ఇండియా స్టాండర్డ్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైన్స్ పట్ల అవగాహన, సిమెంట్ తయారీ వంటి పలు అంశాలపై గురువారం 30 మంది విద్యార్థులను ప్రత్యేక బస్సులో అనకాపల్లి జిల్లా తాళ్లపాలెం రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీకి తీసుకెళ్లినట్లు చెప్పారు. విద్యార్థుల వెంట సైన్స్ టీచర్లు ఎం శాంతి ప్రియ, ఎస్ అప్పారావు వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చప్పా సత్యనారాయణమూర్తి, కొండబాబు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

'ఉక్కు' సమస్యలపై ఎంపీకి వినతి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికుల వేతనాలు, టౌన్‌షిప్‌లోని విద్యా సంస్థలు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలంటూ విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్‌కు సిపిఎం ఫ్లోర్ లీడర్, జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు గురువారం వినతిపత్రం అందజేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు రూ.11,440 కోట్లు ఆర్థిక ప్యాకేజీ ప్రకటించినప్పటికీ స్టీల్‌ప్లాంట్‌లో పనిచేస్తున్న కార్మికుల వేతనాల చెల్లింపుల సమస్య నేటికి పరిష్కారం కాకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. తక్షణం వేతన బకాయిలు చెల్లించేలా, ఫిబ్రవరి మాసం నుంచి వేతనాలు రెగ్యులర్‌గా ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. హెచ్‌ఆర్‌ఎ చెల్లించాలని, క్వార్టర్స్‌కు ఏకపక్షంగా పెంచిన విద్యుత్ ఛార్జీలను రద్దు చేయాలని కోరారు. రిటైర్డ్ అయిన వారిపై గ్రూపు మెడికల్ ఇన్సూరెన్స్ ప్రీమియం అధిక భారం మోపే చర్యలు ఉపసంహరించేలా తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఉన్న కేంద్రీయ విద్యాలయంలో 2025-26 విద్యాసంవత్సరంలో మొదటి, 11వ తరగతుల అడ్మిషన్లు రద్దు చేయాలని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కేంద్రీయ విద్యాలయ సంస్థకు తెలియజేసినట్లు తెలిసిందని, గత ఏడాది కూడా ఇదే వైఖరి స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తీసుకోగా కార్మిక సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళనతో వెనక్కి తగ్గి అడ్మిషన్లు పునరుద్ధరించిందని గుర్తుచేశారు. ఇప్పుడు మరలా ఆ ప్రమాదం ముందుకొచ్చిందన్నారు. ఆరు నెలల నుండి కేంద్రీయ విద్యాలయంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు వేతనాలను స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం చెల్లించకుండా తీవ్ర ఇబ్బందులు పెడుతోందన్నారు.

వెంటనే జోక్యం చేసుకొని కెవి స్కూల్‌లోని తరగతులు మూసివేయనీయకుండా మొదటి, 11వ తరగతికి అడ్మిషన్లు ప్రారంభించేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. టౌన్‌షిప్‌లో ఉన్న విశాఖ విమల విద్యాలయ సంస్థకు కూడా ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకుండా, ఆరు నెలల నుండి ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించకుండా స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తీవ్ర వేధింపులకు గురిచేస్తోందన్నారు. ప్రస్తుతం స్కూల్ అడ్మిషన్ల సమస్య కూడా ముందుకొచ్చిందన్నారు. సమస్యను వెంటనే పరిష్కారం చేసి స్కూల్ కొనసాగేలా, ఉపాధ్యాయుల వేతన బకాయిలు చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. నెలవారీ వేతనాలు సక్రమంగా చెల్లించేలా, స్కూల్ ఫీజులు పెరగకుండా చూడాలన్నారు. టౌన్‌షిప్‌లో మరో ముఖ్యమైన విద్యా సంస్థ డిఎవిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కూడా రెండు నెలల నుండి వేతనాలు చెల్లించడం లేదన్నారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం వల్లే ఈ సమస్య ఉత్పన్నమైందని తెలిపారు. పెరిగిన డిఎతో కలిపి తక్షణం వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తక్షణం కేంద్ర ఉక్కు శాఖ మంత్రితోనూ, స్టీల్‌ప్లాంట్ యాజమాన్యంతోనూ చర్చలు జరిపి పై సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సాయంలో కోత

భూధార్‌తో రైతుకు ముడిపెట్టిన కేంద్రం - పలువురిలో ఆందోళన
24న మూడో విడత పిఎం కిసాన్ నిధులు జమ

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి



పిఎం కిసాన్ సాయం కోసం రైతులను కేంద్ర ప్రభుత్వం సుడుమడతలు పెడుతోంది. రెండు వేలు చొప్పున ఏడాదిలో మూడుసార్లు ఇచ్చే ఆరు వేల రూపాయలకు మురిపిస్తోంది. లబ్ధిపొందుతున్న రైతుల సంఖ్యను కుదించాలని చూస్తోంది. ఇకెవైసి చేసుకోలేని రైతులకు పిఎం కిసాన్ డబ్బులివ్వని ప్రభుత్వం తాజాగా భూధార్ కార్డుకు ముడిపెట్టింది. భూధార్ కార్డు వున్న వారికే సాయం చేయాలనుకోవడంతో ఆ కార్డుల్లేని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 2.50 లక్షల మంది రైతులున్నారు. వీరిలో ఇకెవైసి చేసుకున్న 1.97 లక్షల మంది రైతులకు పిఎం కిసాన్ సాయమందింది. 19వ విడత పిఎం కిసాన్ నిధులు జమచేసే నాటికి ఈ సంఖ్యను ఇంకా తగ్గించేందుకు భూధార్‌తో కేంద్రం లింకు పెట్టింది. వ్యవసాయాధికారుల సమాచారం ప్రకారం ఇప్పటివరకు లక్ష మంది రైతులకు భూధార్ కార్డులు అయ్యాయి. భూధార్ కార్డులు లేని 97 వేల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో ఈ నెల 24న కిసాన్ నిధులు జమచేస్తారా ? లేదా ? అనేది తెలియనుంది. కిసాన్ లబ్ధిదారుల జాబితా ఇంతవరకు జిల్లా వ్యవసాయశాఖకు రాకపోవడంతో లబ్ధిపొందే వారి సంఖ్యపై స్పష్టతలేదు. శనివారం నాటికి జాబితా వచ్చే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

సొంత భూమి కలిగిన రైతుల యాజమాన్య హక్కులకు సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకం, 1బి, అడంగల్ వంటి వాటితో ఎపి స్టేట్ ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదైన వివరాలతో సరిచూస్తున్నారు. ఏ మాత్రం తేడావున్నా భూధార్ కార్డు వచ్చే అవకాశంలేదు. అన్ని వివరాలూ సరిపోతే యునిక్ ఐడి జారీచేస్తున్నారు. ఇలా ఐడి జారీ అయిన వారిలో 2.50 లక్షల మంది రైతులకు లక్ష మంది వున్నారు. మిగిలిన వారికి ఐడిలు రావాల్సివుంది. ఐడిలు రాకపోతే కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే సాయం ఆగిపోతుంది. భూధార్ వీలైనంత త్వరగా పూర్తిచేసుకోవాలని ప్రభుత్వం ఒత్తిడి తెస్తోంది. అన్నదాత సుఖీభవ సాయంలో కేంద్రం విధానాన్ని రాబోయే కాలంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరించనుందని తెలుస్తోంది. రైతుకు చేసే సాయంలో కోత పెట్టేందుకు భూధార్‌ను పరిగణనలోకి తీసుకోనుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం అన్నదాత సుఖీభవ కింద రైతుకు రూ.20 వేలను కూటమి ప్రభుత్వం ఇవ్వాల్సివుంది. కానీ ఇంతవరకూ చంద్రబాబు ప్రభుత్వం పైసా కూడా రైతుకు జమచేయలేదు.

బలిమెల నీటి వినియోగంపై సమీక్ష

ప్రజాశక్తి-సీలేరు : ఆంధ్ర ఒరిస్సా ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయం నీటి వినియోగంపై రెండు రాష్ట్రాల అధికారులు గురువారం మల్కన్‌గిరి జిల్లా బలిమెల ఓహెచ్‌పిసి కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం బలిమెల జలాశయంలో 52.3370 టీఎంసీలు, జోలాపుట్ రిజర్వాయర్‌లో 24.1473 టీఎంసీలు నీటి నిల్వలు ఉన్నాయని నిర్ధారించారు. ఈ నెలాఖరు నాటికి బలిమెలలో 0.50 టీఎంసీలు జోలాపుట్‌లో 0.20 నీటి నిల్వలు వచ్చి చేరుతాయని లెక్కలు కట్టారు. దీని ప్రకారం బలిమెల, జోలాపుట్ జలాశయాలు మొత్తం 77.1843 టీఎంసీలు నీటి నిల్వలు ఉన్నట్లు తేల్చారు. 2024-25 నీటి సంవత్సరం లెక్కల ప్రకారం ఒరిస్సా ఇప్పటివరకు 64.2801 టీఎంసీలు, ఆంధ్ర తన 39.8883 టీఎంసీలు నీటిని వినియోగించుకున్నట్లు లెక్కలు తేల్చారు. దీని ప్రకారం ఆంధ్ర కంటే ఒరిస్సా 24.3918 టీఎంసీల నీరు అధికంగా వినియోగించుకున్నట్లు నిర్ధారించారు. ప్రస్తుతం ఉన్న 77.1843 టీఎంసీల నీటిలో ఆంధ్ర వాటా 50.7881 టీఎంసీలుగా, ఒరిస్సాకు 26.3962 టీఎంసీలుగా కేటాయింపులు చేశారు. ప్రస్తుతం విద్యుత్ డిమాండు ఇరిగేషన్ అవసరాలకు ఆంధ్రాకు 7000 క్యూసెక్కులు, ఒరిస్సా 1500 క్యూసెక్కులు నీటిని వినియోగించుకోవడానికి ఇరు రాష్ట్రాధికారులు అంగీకారం కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో బలిమెల ఓహెచ్‌పిసి సీనియర్ జనరల్ మేనేజర్ దిలీప్ కుమార్ స్వైన్, జనరల్ మేనేజర్లు రామ్ మాధవ్, జ్యోతిర్మయ్యదాస్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఓం ప్రకాష్‌నాయక్, సూపరింటెండెంట్ ఇంజనీర్ రమాకాంత పాత్ర, ఏఈఈ తుసార్ రంజన్ కుంతే, ఏఈలు గడాదర్ ప్రధాన్, కేసీ పాణి, ఆంధ్ర తరపున ఏపీ జెన్కో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు, ఎస్ఈ సివిల్ బి చంద్రశేఖర్ రెడ్డి, ఈఈలు ఎం శ్రీనివాస్ రెడ్డి, రాజేంద్రప్రసాద్, ఏడిఏ దుర్గా శ్రీనివాస్ ఏఈ సిహెచ్ సురేష్ పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో పాల్గొన్న అధికారులు



మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి
- పలుచోట్ల విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - నర్సీపట్నం టౌన్ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి జరుగుతున్న ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, మండలిలో ఉత్తరాంధ్ర వాణిని వినిపిస్తానని యుటిఎఫ్, పలు ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. గురువారం ఆమె అనకాపల్లి జిల్లాలోని నర్సీపట్నం, మాకవరపాలెం మండలాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఉపాధ్యాయులను కలిసి ఈ నెల 27న జరిగే ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. తాను సామాన్య కుటుంబం నుంచి వచ్చానని, సుదీర్ఘకాలం ఉపాధ్యాయ ఉద్యమంలో ఉన్నానని, అందరి సాధకబాధకాలు తెలుసునని అన్నారు. ప్రస్తుతం చట్టసభల్లో పేదలు, ఉపాధ్యాయుల సమస్యలను ప్రస్తావించే వారు కరువవుతున్నారన్నారు. తాను గెలిస్తే ఉపాధ్యాయులు, అధ్యాపకులు, వివిధ రంగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల వాణిని కౌన్సిల్‌లో బలంగా వినిపించగలనని, పోరాడగలనని చెప్పారు. సిపిఎస్, ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేస్తున్న యాప్‌ల రద్దుకు కృషి చేస్తానన్నారు. ఆమె వెంట జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కె.త్రిమూర్తులు రెడ్డి, యుటిఎఫ్ నాయకులు చిట్టయ్య, మోహన్, గాయత్రి, సిఐటియు నాయకులు అడిగర్ల రాజు ఉన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు పక్కా ఏర్పాట్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గ స్థానానికి ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణకు సంబంధించి పక్కా ఏర్పాట్లు చేయాలని, శాంతి భద్రతల సమస్య రాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ఉమ్మడి జిల్లా ఎఆర్‌ఒలను రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ఎక్కడా ఎలాంటి లోపాలూ తలెత్తకుండా సమన్వయంతో వ్యవహరించాలని, ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో ఉమ్మడి జిల్లాల అధికారులతో గురువారం కలెక్టరేట్ మీటింగ్ హాలులో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఎన్నిక నిర్వహణలో అనుసరించాల్సిన పద్ధతులు, తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. అన్ని శాఖలూ సమన్వయంతో వ్యవహరించి ఎన్నికను ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల గుర్తింపు, జాబితా రూపకల్పన, బ్యాలెట్ పేపరు తయారీ, గుర్తుల కేటాయింపు తదితర అంశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. సాంకేతికపరమైన విషయాల్లో ఆచితూచి వ్యవహరించాలన్నారు. పోలింగ్ మెటీరియల్ అందజేత, స్వీకరణ విషయంలో జాగ్రత్తగా ఉండాలని, జవాబుదారీతనం ఉండేలా చూసుకోవాలని అన్నారు. పోలింగ్ ముందు రోజే సిబ్బంది ఆయా కేంద్రాలకు చేరుకోవాలని చెప్పారు. వారికి స్థానిక అధికారులు తగిన వసతి కల్పించాలని, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా చూడాలని, తాగునీరు, ఆహారం అందజేయాలని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్ ఉండేలా చూసుకోవాలని సంబంధిత అధికారులకు చెప్పారు. పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు తెలపాలని, కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసుకోవాలని, ప్రక్రియకు సంబంధించిన సమాచారం చేరవేతలో జాగురూకతతో వ్యవహరించాలని సూచించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి సమావేశానికి హాజరైన ఎఆర్‌ఒలు, పోలీసు అధికారులు అక్కడి పరిస్థితులను రిటర్నింగ్ అధికారికి వివరించారు. వారు చేపడుతున్న చర్యల గురించి తెలిపారు. విశాఖపట్నం ఎఆర్‌ఒ బిహెచ్ భవానీ శంకర్, అల్లూరి సీతారామరాజు ఎఆర్‌ఒ పద్మలత, అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం, శ్రీకాకుళం జిల్లాల ఎఆర్‌ఒలు పాల్గొన్నారు.